ఆదర్శనీయులు కృత్తివెంటి



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న మూర్తి

రామచంద్రపురం: సుమారుగా 118 ఏళ్ల క్రితమే రామచంద్రపురం పరిసర ప్రాంత ప్రజలకు ఉచితంగా విద్యను అందించేందుకు వంద ఎకరాలు దానం చేసిన మహనీయుడు కృత్తివెంటి పేర్రాజు పంతులు అందరికీ ఆదర్శనీయులని యోగ వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు తొగరుమూర్తి అన్నారు. పట్టణంలో కృత్తివెంటి పేర్రాజు పంతులు విద్యా సంస్థల ఆవిర్భావ దినోత్సవ వేడులకను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో యోగా, వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో కృత్తివెంటి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృత్తివెంటి విద్య సంస్థల్లో విద్యనభ్యసిస్తూ ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సమావేశంలో వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి పెంటపాటి అన్నవరం, అంకం శ్రీనివాస్, పామర్తి మధు, బలుసు శ్రీనివాస్ చౌదరి, శాఖా వీరన్న, వీరా శ్రీను, యోగా గురువులు విద్యార్థిని విద్యార్థులు, పాల్గొన్నారు.

ఉరి వేసుకుని యువకుడి మృతి

కాజులూరు: పల్లిపాలెంలో పిల్లి మధుసాయిచంద్రశేఖర్(25) అనే యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనకు సంబంధించి వివరాలు స్థానికులు, గొల్లపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పిల్లి మధుసాయిచంద్రశేఖర్ ఏలూరులో వాచ్‌మెన్‌గా పని చేస్తుండగా తల్లి అక్కడే చిన్న, చితక పనులు చేసుకుంటూ జీవనోపాధి సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో మధుసాయిచంద్రశేఖర్ పల్లిపాలెంలోని తన అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటున్నాడు. బుధవారం రాత్రి 10 గంటల సమయంలో గదిలోనికి వెళ్లి ఇంటి పైకప్పు దూలానికి ఉరి వేసుకున్నాడు. కొద్దిసేపటికి అమ్మమ్మ గమనించి కేకలు వేయగా పరిసర కుటుంబీకులు వచ్చి కొన ఊపిరితో ఉన్న మధుసాయిచంద్రశేఖర్‌ని కిందికి దించి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే అతను మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని గురువారం గ్రామానికి తరలించారు. మధుసాయిచంద్రశేఖర్ సోదరి దర్గామల్లేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు గొల్లపాలెం ఎస్సై ఎం.మోహన్‌కుమార్ తెలిపారు.

ఏరియా ఆసుపత్రిలో ఎన్‌ఎస్‌ఎస్ సేవలు

రామచంద్రపురం: స్థానిక ఏరియా హాస్పిటల్‌లో మోడ్రన్ డిగ్రీ కాలేజీకి చెందిన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ల నేతృత్వంలో గురువారం రోగులకు సేవలు అందించారు. ఇన్, అవుట్ పేషెంట్ రోగులకు పండ్లు వేరుశనగ అచ్చులను పంపిణీ చేశారు. సేవా కార్యక్రమంలో పాల్గొన్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లను మోడరన్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ జీవీ రావ్ అభినందించారు.

ముక్కోటి వేడుకలకు సర్వం సిద్ధం

- నేడు ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు, ఆలయ కమిటీలు

రాయవరం: ముక్కోటి ఏకాదశి వేడులకు మండలంలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. ముఖ్యంగా పీఠంలో ముక్కోటి వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని టీటీడీ దేవస్థానం అందజేసిన శ్రీదేవి, భూదేవి సమేత విజయ వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. పీఠంలో భక్తులకు ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేసినట్లు పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు తెలిపారు. సోమేశ్వరంలోని రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి, బాలా త్రిపుర సుందరీ సమేత సోమేశ్వరాలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఏకాదశి వ్రతం నిర్వహించనున్నారు. స్థానిక భూమంచిరెడ్డి యూత్ ఆధ్వర్యంలో ముక్కోటి ఏకాదశి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అలాగే మండలంలోని వి.సావరం శెట్టిబలిజ రామాలయం, వెదురుపాక గీతాజ్ఞాన మందిరం, చెల్లూరు, వెంటూరు, పసలపూడి తదితర గ్రామాల్లోని వివిధ ఆలయాల్లో ముక్కోటి ఏకాదశిని ఘనంగా నిర్వహించేందుకు భక్తులు ఏర్పాట్లు చేశారు.

తిరుపతి ఘటన బాధాకరం

మండపేట: తిరుమల తిరుపతి దేవస్థానంలో టోకెన్ల కోసం జరిగిన తొక్కిసలాటలో భక్తులు మృతి చెందడం పట్ల బీజేపీ పట్టణ కన్వనర్ మద్దుల సుబ్బారావు విచారం వ్యక్తం చేశారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. తిరుపతిలో జరిగిన ఘటన బాధాకరమన్నారు. తొక్కిసలాటలో ఆరుగురి మృతి చెందడం మనసును కలచివేసిందన్నారు. లక్షలాది మంది భక్తులను పిలిచి టీడీడీ అధికారులు చేతులెత్తేయడం దారుణమన్నారు. కనీస ఏర్పాట్లు కూడా చేయలేని దుస్థితిలో టీడీడీ బోర్డు ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల తప్పిదంతో ఆరుగురు మృత్యువాత పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని హితవు పలికారు.

పశువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కె.గంగవరం: గ్రామీణ ప్రాంత పాడి రైతులు పశువులకు వచ్చే వ్యాధులపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ పంపన నాగమణి సూచించారు. అముజూరులో గురువారం మండపేటకు చెందిన పశుసంవర్ధన శిక్షణ కేంద్ర సభ్యులు ఉచితంగా పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎంపీపీ పంపన నాగమణితో పాటు జాయింట్ డైరెక్టర్ ఆర్.వెంకటేశ్వరావు, డిప్యూటీ డైరెక్టర్ బి.గణపతిరావు రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. ఈ శిబిరంలో పశుశిక్షణ కేంద్రం పశువైద్యులు గ్రామంలోని సుమారు వంద పశువులకు ఉచితంగా గర్భకోశ పరీక్షలు, చూడి పరీక్షలు నిర్వహించారు. అనంతరం పాడి రైతులకు ఉచితంగా మినరల్ మిక్చర్‌తో పాటు పలు రకాల మందులు అందించారు. గ్రామ సర్పంచ్ నానాపరపు కల్యాణి శ్రీనివాస్, పశువైద్యులు బిందు, భావనజ్యోతి, ఎం.కృష్ణార్జునరావు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు కుందూరు విద్యార్థి

కె.గంగవరం: ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు కుందూరు ఉన్నత పాఠశాల విద్యార్థి కుందున లక్ష్మీ ప్రియ ఎంపికైయింది. ఇటీవల ఏలూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో అండర్-14 విభాగం లాంగ్ జంప్‌లో ప్రథమ స్థానం, హైజంప్‌లో తృతీయ స్థానం సాధించి జాతీయ స్థాయికి ఎంపికైనట్టు హెచ్‌ఎం చింతలపూడి ఆదినారాయణ, వ్యాయామ ఉపాధ్యాయులు అయినవర్తి వీర వెంకట సత్యనారాయణ తెలిపారు. ఈ నెల 9వతేదీ నుంచి 15వ తేదీ వరకు జార్ఖండ్‌లోని రాంచిలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుందని వారు పేర్కొన్నారు. లక్ష్మీ ప్రియను ఎంపీపీ పంపన నాగమణి, సర్పంచ్ పంపన సత్యానందం, విద్యా కమిటీ చైర్మన్ వెంకట సత్యనారాయణ, సీర్రా సురేష్ ,గ్రామ పెద్దలు అభినందించారు.

నామినేటెడ్ పదవులకు ముస్లింలంతా అర్హులే

మండపేట: ముస్లింల అభ్యున్నతికి ప్రభుత్వం త్వరలో ప్రకటించే నామినేటెడ్ పదవులకు వివిధ శాఖలుగా ఉన్న నూర్‌బాషా, సున్ని, షియాల్లోని ముస్లింలంతా అర్హులేనని ముస్లిం నాయకుడు సల్మాన్ హుస్సేన్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర మైనారిటీ విభాగం సలహాదారు ఎంఏ అహ్మద్ షరీఫ్ ప్రకటన విడుదల చేసి మంత్రులకు, ఎంపీ, ఎమ్మెల్యేలకు లేఖలు రాశారన్నారు. దీనిపై ముస్లిం మైనారిటీలు మేల్కొని పదవులు చేపట్టి ముస్లింల అభివృద్ధికి పాటుపడాలని ఆయన ఆకాంక్షించారు.

ముగిసిన కోనసీమ క్రీడలు



విద్యార్థులను అభినందిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కపిలేశ్వరపురం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన కోనసీమ క్రీడలు గురువారంతో ముగిశాయి. విద్యార్థులకు సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో పల రకాల క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రజాప్రతినిధులు, అధికారుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. సర్పంచ్ సాకా శ్రీనివాస్ అధ్యక్షతన, ఎంఈఓ కె.తాతారావు పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు హాజరయ్యారు. రాష్ట్ర బాస్కెట్ బాల్ కార్యదర్శి గన్నమనేని చక్రవర్తి సమకూర్చిన బహుమతులను ఎంపీపీ కె.రత్నకుమారి, ఎంఈఓ కె.తాతారావు, ఎంపీటీసీ గొల్లపల్లి సోనియా, శీలం భాస్కర రావు, ఉప సర్పంచ్ బొక్కా రాంబాబు, మాజీ వైస్ ఎంపీపీ నెక్కంటి శ్రీరాంజీ, హెచ్‌ఎం వంగా శ్రీనివాస్ విజేతలకు అందజేశారు. ఈ క్రీడా పోటీలకు న్యాయ నిర్ణేతలుగా వ్యాయామ ఉపాధ్యాయులు గుబ్బల వేణుగోపాలరావు, ముత్తా సత్యనారాయణ, వాసంశెట్టి రవికుమార్, మేకా సత్యనారాయణ, దుర్గాప్రసాద్, బేగం వ్యవహరించారు.

పాఠశాలకు సౌండ్ సిస్టమ్ వితరణ



దాత అందజేసిన సౌండ్ సిస్టంతో హెచ్‌ఎం రమాదేవి, ఉపాధ్యాయులు

కపిలేశ్వరపురం: మండలంలోని మాచర జెడ్పీ ఉన్నత పాఠశాలకు గురువారం దాతలు సౌండ్ సిస్టమ్ వితరణ చేశారు. గ్రామానికి చెందిన గొడవర్తి రాంప్రసాద్, సోమ సూర్యప్రకాశరావు, గంగాధర వీర ప్రభాకరరావు, కరుటూరి జానకీరత్నం రూ. 20 వేల విలువైన మల్టీ పర్పస్ యూజ్ సౌండ్ సిస్టంను అందజేశారు. వారి తల్లి దండ్రులు గొడవర్తి పెద వెంకట్రావు, సుబ్బాయమ్మ దంపతుల జ్ఞాపకార్థం సౌండ్ సిస్టమ్ అందజేసినట్టు తెలిపారు. దాతలకు పాఠశాల హెచ్‌ఎం రమాదేవి, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

డంపింగ్ యార్డు సమస్యకు మోక్షం

రామచంద్రపురం రూరల్: మేజర్ పంచాయతీ అయిన ద్రాక్షారామలో దశాబ్దాలుగా ఉన్న డంపింగ్ యార్డు సమస్యకు మోక్షం లభించినట్టు ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ గురువారం విలేకరులకు తెలిపారు. ఆదివారపుపేట రోడ్డులో రెండు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సూచన మేరకు గత ఆర్డీఓ సుధాసాగర్ ద్వారా జిల్లా కలెక్టర్‌కు సమస్యను వివరించి డంపింగ్ యార్డుకు కేటాయించేలా చర్యలు తీసుకున్నారన్నారు. దీంతో గురువారం నుంచే నూతన డంపింగ్ యార్డులో చెత్తను డంప్ చేసేందుకు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు.

ప్రగతి పథంలో పయనం

- పారిశ్రామిక, వ్యాపార రంగాల్లో దూసుకుపోతున్న మండపేట
- పౌల్ట్రీ, రైసుమిల్లులు తదితర పరిశ్రమలతో ఆర్థిక పరిపుష్టి
- వెదజల్లుతున్న ఆధ్యాత్మిక వెలుగులు



మండపేట పట్టణంలోని కలువపువ్వు సెంటర్

కపిలేశ్వరపురం: మండపేట పట్టణం ప్రగతి పథంలో పయనిస్తోంది. చుట్టూ పచ్చటి పొలాలు, పట్టణంలో పారిశ్రామిక సంస్థలు పరవళ్లు తొక్కుతున్నాయి. పౌల్ట్రీ, రైసుమిల్లు రంగాలు దేశంలోనే ఖ్యాతిగడిస్తున్నాయి. వాటి అనుబంధ వ్యాపారాలు సైతం ముందుకు సాగుతున్నాయి. అంతటి మండపేట పేరు వెనుక పురాణ ప్రాశస్త్యం, చారితక కథనాలు వాడుకలో ఉన్నాయి. శతాబ్దాల క్రితం అభయారణ్యంగా ఉండే మండపేట ప్రాంతంలో మాండవ్యముని తపస్సు చేశారని, ఆయన పేరుతోనే పూర్వం మాండవ్యపురంగా, కాలక్రమంలో మండపేటగా ఆవిర్భవించిందని పెద్దలు చెబుతారు. మండపేట పరిసర గ్రామాల్లో ప్రముఖ ఆలయాలు, పీఠాలు ఉండటంతో ఆధ్యాత్మిక కాంతులు వెదజల్లుతున్నాయి. ఆంధ్రా అన్నపూర్ణగా ఖ్యాతిగాంచి బ్రిటీష్ వారి నుంచి ప్రశంసలందుకున్న డొక్కా సీతమ్మ జన్మస్థలం మండపేట కావడం విశేషం

పలు అవార్డులు సొంతం

30 వార్డులు కలిగిన మండపేట పురపాలక సంఘం గతంలో స్వచ్ఛతా నిర్వహణలో అనేక అవార్డులు అందుకుంది. పట్టణ సమీపంలోని రాయవరం, కపిలేశ్వరపురం, మండపేట రూరల్ మండలాల్లోని 43 గ్రామాల ప్రజలు పట్టణానికి వచ్చిపోతూ వ్యాపార కార్యకలాపాల్లో పాలుపంచుకుంటున్నారు. నియోజకవర్గంలోని మూడు మండలాల్లోనూ రైసు మిల్లులు, పౌల్ట్రీలు ఉన్నాయి. 90 శాతం వరి పంట పండుతోంది. ఇతర జిల్లాల్లోని పండిన వరిపంట ఇక్కడి మిల్లులకు తీసుకువచ్చి బియ్యంగా మిల్లింగ్ చేస్తారు. పట్టణంలో విద్యా సంస్థలు సైతం పేరుపొందాయి.

గోదావరి ఎంటర్ ప్రైజెస్‌లోనే షాపింగ్

మండపేట పరిసర గ్రామాల ప్రజలు పండగ ఏదైనా షాపింగ్ మాత్రం మండపేట శ్రీగోదావరి ఎంటర్ ప్రైజెస్‌లోనే చేస్తారు. గత 30 ఏళ్లుగా అందుబాటు ధరల్లో అన్ని రకాల హోమ్‌నీడ్స్, ఎల్రక్టానిక్ వస్తువులను గోదావరి ఎంటర్ ప్రైజెస్ అందిస్తోంది. ఆన్‌లైన్ ధరకంటే తక్కువ ధరలకు సులభ వాయిదాల పద్ధతిలో అందరికీ అందుబాటులో ఉన్నాయని ప్రొప్రైటర్ కోనాల వీరరాఘవరెడ్డి తెలిపారు.

రాయల్ మెట్రిసెస్

ఇప్పనపాడులోని పరుపుల ఫ్యాక్టరీ పేరొందింది. నడుము నొప్పి ఉన్నవారికి, రీబాండ్, కాయిర్ ఏసీ/డీసీ పోమ్, స్ప్రింగ్ మెమరీ పరుపులు అతి తక్కువ ధరలకు అవసరమైన కొలతలతో అప్పటికప్పుడు తయారు చేసి గత ఐదేళ్లుగా అందరికీ అందుబాటులో ఉంచుతున్నట్టు రాయల్ మెట్రీస్ ప్రొప్రైటర్ వల్లీ తెలిపారు.

సంతాన సాఫల్యం సులభతరం



జీన్‌టెక్ సంస్థతో సాంకేతిక ఒప్పందాలను కుదుర్చుకుంటున్న లండన్ ఐవీఎఫ్ ప్రతినిధులు

కాకినాడ క్రైం: ఉభయ గోదావరి జిల్లాల పరిధిలోని రాజమహేంద్రవరం, కాకినాడ నగరాల్లో లండన్ ఐవీఎఫ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ చంద్రారెడ్డి తెలిపారు. 2015లో విశాఖపట్నంలో తొలి బ్రాంచ్ ప్రారంభించినట్లు చెప్పారు. సంతానోత్పత్తి చికిత్సలో విశేష సేవలందిస్తోందన్నారు. ప్రపంచ ప్రఖ్యాత జెనోమిక్ ఫెర్టిలిటీ అనాలసిస్ టెక్నాలజీని లండన్ ఐవీఎఫ్ అందిపుచ్చుకుందన్నారు. జీనీఫెమినా, జీనీ యాండ్రో అనే అధునాతన సాంకేతిక ప్రక్రియల ద్వారా పురుషులతో పాటు మహిళలల్లోనూ వంధ్యత నివారణకు చికిత్సలు అందిస్తున్నట్లు తెలిపారు. జీన్ టెక్, జీఎఫ్ఏ టెక్నాలజీల సాయంతో జీనీఫెమినా, జీనియాండ్రో చికిత్సా విధానాలను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. యూకేలో శిక్షణ పొందిన వైద్య నిపుణులను ఈ చికిత్సల కోసం వినియోగిస్తున్నామన్నారు. పునరుత్పత్తి వైఫల్యాలను కనుగొనేందుకు చేసిన కృషికి గాను టైమ్స్ గ్రూప్ ద్వారా ఏపీ బెస్ట్ అవార్డును అందుకున్నామని చెప్పారు. జీన్‌టెక్ వ్యవస్థాపకులు, చీఫ్ సైన్స్ అధికారి డాక్టర్ అనురాధా ఉడుముడి పునరుత్పత్తి చికిత్సా విధానాలలో సాంకేతికతను జోడించేందుకు ఎనలేని కృషి చేస్తున్నారన్నారు.

రేపు రిటైర్డ్ ఎంప్లాయిస్ సమావేశం

మండపేట: స్థానిక శ్రీరామ హిందూ మున్సిపల్ యూపీ స్కూల్లో శనివారం మధ్యాహ్నం 3 గంటలకు విశ్రాంత ఉద్యోగుల సమావేశం ఏర్పాటు చేసినట్టు రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు దేవళ్ల సత్యనారాయణ, పెంకే గోవిందు గురువారం తెలిపారు. సమస్యలపై అజెండాలో పలు అంశాలు చేర్చామని, వాటిపై చర్చించి కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఈ సమావేశానికి సంఘ సభ్యులంతా తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

పాఠశాలల్లో సంక్రాంతి



మాచర జెడ్పీ ఉన్నత పాఠశాలలో భోగి మంట వేస్తున్న విద్యార్థులు

- పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు
- వేషధారణలతో ఆకట్టుకున్న చిన్నారులు



రాయవరం మండలం సీతమ్మతోట ప్రాథమిక పాఠశాలలో భోగి మంట చుట్టూ చిన్నారుల సందడి



కె.గంగవరం ఉన్నత పాఠశాలలో భోగి మంట వద్ద సందడి చేస్తున్న విద్యార్థులు

కపిలేశ్వరపురం /రాయవరం /మండపేట: రామచంద్రపురం రూరల్/కె.గంగవరం: పాఠశాలల్లో సంక్రాంతి సందడి నెలకొంది. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. అన్ని పాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. నాలుగు రోజుల ముందే నిర్వహించిన సంక్రాంతి వేడుకల్లో చిన్నారులు ఆనందోత్సాహాలతో సందడి చేశారు. సంప్రదాయ దుస్తుల్లో హరిదాసు వేషధారణలు, బొమ్మలకొలువు, భోగి మంట చుట్టూ విద్యార్థినుల నృత్య ప్రదర్శన అలరించాయి. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేవారు. తెలుగువారి పండుగల్లో ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకునే సంక్రాంతి పండుగ ప్రాధాన్యతను విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు తెలియజేసేందుకే పాఠశాలల్లో దీన్ని నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు.

నేడు కొండమూరి విగ్రహావిష్కరణ

కపిలేశ్వరపురం: మండలంలోని అంగరలో శుక్రవారం ఆర్‌ఎంపీ వైద్యుల ఆరాధ్య దైవంగా పేరొందిన, కపిలేశ్వరపురం గ్రామానికి చెందిన డాక్టర్ కొండమూరి నరసింహమూర్తి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్టు పీఎంపీ అసోసియేషన్ నాయకులు గంగుమళ్ల రాంబాబు తెలిపారు. నరసింహమూర్తి వద్ద వైద్యం నేర్చుకున్న వారు కపిలేశ్వరపురం మండలంతో పాటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని అనేక ప్రాంతాల్లో ప్రైవేటు వైద్య వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. ఆ అభిమానంతో అంగర గ్రామం ప్రధాన రహదారిలో కొండమూరి విగ్రహాన్ని నెలకొల్పామని చెప్పారు.

దొంగతనం కేసులో నలుగురికి జైలు

కపిలేశ్వరపురం: దొంగతనం నేరారోపణలో విచారణాంశాలు రుజువు కావడంతో నలుగురు నిందితులకు జైలు శిక్ష విధిస్తూ ఆలమూరు జేఎఫ్‌సీఎం కోర్టు జడ్జి ఐ.ప్రవీణ్‌కుమార్ గురువారం తీర్పు చెప్పారు. అంగర ఎస్సై డి.రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం... తన ఇంటిలో రాత్రి సమయంలో బంగారం, వెండి ఆభరణాలు దొంగతనానికి గురయ్యాయంటూ కపిలేశ్వరపురం గ్రామానికి చెందిన గరగపాటి సూర్యకుమారి 2023 జూలై 17న అంగర పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సై జి. చంటి కేసు నమోదు చేశారు. కేసులో నిందితులైన కాజులూరుకు చెందిన షేక్ అజీజ్, రాజమహేంద్రవరానికి చెందిన యడ్ల ఉషా సూర్య వెంకట రాకేష్, తాతపూడికి చెందిన కాండ్రేగుల శ్రావణ కృష్ణ, ఇంద్రపాలెంనకు చెందిన ముషినాడ గౌరీ మల్లేశ్వరి నేరం చేసినట్లు రుజువైంది. నిందితులకు మూడేళ్ల సాధారణ జైలు శిక్ష, రూ.పదివేల చొప్పున జరిమానా విధిస్తూ ఆలమూరు జేఎఫ్‌సీఎం కోర్టు జడ్జి తీర్పు చెప్పారు. బాధితురాలి తరపున ఏపీపీ విల్లా శ్రీరాములు వాదించారు.

అభివృద్ధి పథంలో రామచంద్రపురం



మోడరన్ విద్యా సంస్థల అధినేత జీవీరావు



మోడరన్ విద్యా సంస్థలు

రామచంద్రపురం: పెరుగుతున్న ప్రజల జీవన శైలికి అనుగుణంగా రామచంద్రపురం పట్టణం దినదిన అభివృద్ధి చెందుతుంది. ఎన్నో ప్రత్యేకతలు చోటు చేసుకున్న రామచంద్రపురంలో విద్యా రంగంలో ప్రగతిపథం సాధిస్తోంది. విద్యా పరంగా ప్రభుత్వ పథకాలలు అమలు చేయడంలో ఉత్తమ ప్రతిభ ఉన్న విద్యార్థులను తీర్చి దిద్దడంలో పట్టణంలో 1978లో జీవీరావు ఆధ్వర్యంలో స్థాపించిన మోడరన్ విద్యా సంస్థలు గత 47 వసంతాలుగా ముందుంటూ ప్రజల మన్ననలు పొందుతోంది.

కేజీ నుంచి పీజీ దాక ఎంతో మంది విద్యార్థులను తీర్చి దిద్ది దేశ విదేశాలలో స్థిర పరిచిన ఘనత మోడరన్ విద్యా సంస్థలకు దక్కింది. ఈ విద్యా సంస్థలకు 7 జాతీయ అవార్డులు వచ్చాయి. ఏడు విభాగాల్లో సేవా కార్యక్రమాలు, పేద విద్యార్థులను చదివించడం, ఏటా సుమారు 20 మంది తల్లిదండ్రులను కోల్పోయిన విద్యార్థులను హాస్టల్‌తో సహా ఉచితంగా చదివిస్తున్నారు. నాగార్జున, గీతం, ఏయూ యూనివర్సిటీల ద్వారా ఉన్నత విద్యార్థులు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. 72 గ్రామాలకు బస్సు సౌకర్యం, హాస్టల్ సౌకర్యం కల్పిస్తున్నారు. పట్టణంలో విద్యా సంస్థలకు పునాది మోడరన్ విద్యా సంస్థలే. రాజమండ్రి, కాకినాడల తరువాత రామచంద్రపురం వస్త్ర వ్యాపారంలో ప్రగతిని సాధించింది.

పిరమిడ్ స్పిరిచ్యువల్ జిల్లా అధ్యక్షుడిగా నల్లమిల్లి



నూతన అధ్యక్షుడు భాస్కరరెడ్డితో సొసైటీస్ సభ్యులు

మండపేట: పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ కోనసీమ జిల్లా అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన పారిశ్రామికవేత్త, మహాత్మా గాంధీ సేవాసమితి అధ్యక్షుడు నల్లమిల్లి విజయ భాస్కరరెడ్డి ఎన్నికయ్యారు. బ్యాంకు కాలనీలోని కొనగళ్ల సత్యనారాయణ పిరమిడ్ ధ్యానకేంద్రం వద్ద గురువారం పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీస్ జిల్లాస్థాయి సమావేశం జరిగింది. విజయభాస్కరరెడ్డిని ఏకగ్రీవంగా సొసైటీస్ జిల్లా అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. సమావేశంలో జిల్లాలోని ప్రముఖ పిరమిడ్ మాస్టర్స్ బోనగిరి సత్యసుధ, పులగం లక్షీశ, వానపల్లి నాగేశ్వరరావు, వల్లూరి వీర వెంకట సత్యనారాయణ చౌదరి, గొల్లవిల్లి నాని, వానవల్లిపాలెం గురువు ఋషేంద్ర, 80మంది ధ్యానులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజలకు అత్యాధునిక నేత్ర వైద్య సేవలు

పెదపూడి: అనపర్తి నారాయణరెడ్డి కంటి ఆస్పత్రిలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన రోబోటిక్ లేజర్ లాసిక్ శస్త్రచికిత్స అందుబాటులో ఉందని నేత్ర వైద్య నిపుణుడు తేతలి సత్యనారాయణరెడ్డి తెలిపారు. అనపర్తి, పరిసర గ్రామాల ప్రజలకు 50 ఏళ్లుగా కంటి వైద్యం అందజేస్తున్నామన్నారు. ప్రస్తుతం ఆధునిక పరికరాలతో, అత్యాధునిక సేవలను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. తేతలి సత్యనారాయణరెడ్డి తనయుడు డాక్టర్ వెంకటరామిరెడ్డి, కోడలు డాక్టర్ సంధ్యారెడ్డి కంటి వైద్యంలో ఎప్పటికప్పుడు ఆధునిక పరిజ్ఞానాన్ని సామాన్యులకు అందుబాటులో తీసుకువస్తున్నారన్నారు.

సుజుకీ వారి బంపర్ ఆఫర్స్

సుజుకీ ఆథరైజ్డ్ డీలర్ కంటిపూడి సుజుకీ సంక్రాంతి సందర్భంగా వినియోగదారులకు ప్రత్యేకమైన లక్కీ డ్రా ఆఫర్ల సౌకర్యం కల్పించింది. మొదటి బహుమతిగా మారుతీ సుజుకీ ఫ్రాంక్స్ కారు, రెండో బహుమతిగా అయిదుగురికి సుజుకీ జిక్సర్ ఎస్ఎఫ్ 250 బైక్, మూడో బహుమతిగా 15 మందికి సుజుకీ జిక్సర్ 250 బైక్స్, నాలుగో బహుమతిగా 20 మందికి ఆపిల్ ఐఫోన్ (15, 128 జీబీ)ను ప్రకటించారు.

ప్రజలకు అందుబాటులో స్కానింగ్ సౌకర్యం

రామచంద్రపురం: రామచంద్రపురం పట్టణంలో అత్యాధునిక స్కానింగ్ సౌకర్యాన్ని పావని సిటీ స్కానింగ్ సెంటర్ అందిస్తున్నారు. ఒకప్పుడు నగరాలకు మాత్రమే పరిమితమైన రోగనిర్ధారణ సేవలు ఇప్పుడు మండపేట రామచంద్రపురం అనపర్తి ప్రజలకు అందుబాటులో ఉంది. ఇక్కడ రోగులు, గర్భిణుకు అవసరమైన సిటీ స్కానింగ్, అన్ని రకాల స్కానింగ్‌లతో పాటుగా ఎక్స్‌రే, రక్త పరీక్షలు చేస్తున్నారు. అతి తక్కువ ఖర్చులతో నాణ్యమైన వైద్యం స్థానికంగా రామచంద్రపురంలో పావని సిటీ స్కానింగ్ సెంటర్ ద్వారా అందిస్తున్నట్టు డాక్టర్ బికే శివప్రసాద్ గురువారం తెలిపారు.

ఆధునిక వైద్యం.. పట్టణ వాసులకు వరం

- కార్పొరేటు వైద్యానికి చిరునామా 'కిమ్స్'
- కేర్ ఆస్పత్రికి ఎక్స్‌లెన్స్ అవార్డు

అమలాపురం టౌన్: అమలాపురంలోని కిమ్స్ బోధనాసుపత్రి ద్వారా ఇప్పటికే ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుతున్నాయి. ఈ వైద్య కళాశాల ద్వారా ఏటా దాదాపు వంద మంది వైద్య విద్యార్థులు అత్యుత్తమ వైద్యులుగా బయటకు వెళ్లి వైద్య వృత్తిలో విశేషంగా రాణిస్తున్నారు. గతంలో కోనసీమ కేంద్రంగా సేవలు అందించిన ఈ బోధనాసుపత్రి ఇప్పుడు అమలాపురం జిల్లా కేంద్రం అయ్యాక వైద్య సేవలను మరింత విస్తరిస్తోంది. ముఖ్యంగా కిమ్స్ ఆధ్వర్యంలో ఆయువు భరోసా, కమాండ్ సెంటరు అనే రెండు సరికొత్త ప్రక్రియలు అందుబాటులోకి వచ్చాయి. ఆయువు భరోసా ద్వారా రోగులకు ప్రత్యేకంగా ఆరోగ్య సభ్యత్వ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయువు భరోసా ద్వారా సకాలంలో అన్ని రోగాలకు చికిత్స అందించేందుకు అవకాశం కలుగుతుంది. ఇక కమాండ్ సెంటర్ ద్వారా సకాలంలో వైద్యం అందించడమే కాక పాటు వైద్య ఖర్చులను తగ్గించేలా ఆన్‌లైన్ విధానం అందుబాటులోకి రానుంది. వైద్య రంగంలో అందిస్తున్న విశేష సేవలకు గాను అమలాపురంలోని కోనసీమ కేర్ జనరల్ అండ్ ఎమర్జన్సీ ఆసుపత్రికి న్యూఢిల్లీలోని ఉయ్‌కేర్ ఫౌండేషన్ ఎక్సలెన్స్ అవార్డును ప్రకటించింది. ఆసుపత్రి వైద్యులు డాక్టర్ కారెం రవితేజ ఈ అవార్డును ఫౌండేషన్ ప్రతినిధుల నుంచి అందుకున్నారు. కరోనా సమయంలో కోనసీమ కేర్ ఆసుపత్రి ద్వారా పేద ప్రజలకు సకాలంతో వైద్య సేవలు అందించి పలువురి మన్ననలు పొందారు.